# పురుష లక్షణం....

చినముత్తేవి
సేతు మాధవరావు

"సంఘానికి కట్టుబడి చేసుకునే పెళ్ళిళ్లు సవ్యంగా నడవవు" అంటూ లోపలికి వచ్చేడు శేషారావు.

'ఏమిటోయి అంటున్నావు, ఇలా కూర్చో" అని ఒక కుర్చీ చూపేడు రాము.

'ఇదిగో యీ చైను. యీ మంగళసూత్రం ఎవరివో గుర్తించగలవు' అంటూ పొట్లం విప్పి డ్రాయరుమీద పెట్టాడు శేషు.

"యివి మా లీలవి, ఎవరో దొంగిలించారని చెప్పిందే"

"వీటిని ఎవరూ దొంగిలించలేదు—ఆడాళ్ళ పన్నాగం ఎంతవరకైనా వుంటుంది''

'ఆఁ! దొంగిలించలేదు—ఆ కట్టుకథేమిటి?'

'శాంతంగా విను, ప్రేమంటే ఏమిటో, నిజమైన ప్రేమంటే ఎలా వుంటుందో—'

'దొంగతనం కాకపోవడం, ప్రేమని శంకించడం—నా బుర్ర అంతా పాడుచేస్తున్నావు ఏమిటీ ఎత్తు?'

'యీ వస్తువులు నీ లీలవి, నాకు ప్రేమోపహారంగా యిచ్చినవి అంతేనా?'

రామం నిశ్చేష్టుడై కుర్చీలో కూలబడ్డాడు స్వప్రహ కూడా తప్పినట్లున్నది. శేషు ఇంకా ఏమో చెప్తూనే వున్నాడు.

'లీల నాకు మరదలవుతుందని నీవు మర్చిపోయివుంటావు'

'నీవు మూర్ఖుడివి, దుర్మార్గుడివి—'

'కాను, నేను కాను యింకా సాక్ష్యం కావాలంటే—'

★

'కట్టిపెట్టు, నిజం చెప్తావా లేదా?'

'నమ్మనమ్మకపో యిదిగో యింకో వుంగరం'

రామానికి యింకే సాక్ష్యం కావాలి! తాను ప్రేమచిహ్నంగా లీలకిచ్చిన వుంగరమే అది. రామం తల తిరిగిపోయింది. లీల తనని ప్రేమించినట్లు నమ్మించింది. ఎంత ద్రోహం. శేషు ఎంత ద్రోహం చేసేడు. ఇంకా నిశ్చింతగా శేషు కూర్చొని ఏదో వ్రాస్తున్నాడు రాము కళ్ళు మూసుకున్నాడు. ఇల్లంతా నిశ్శబ్దం. అలా ఎంతసేపు గడిచిందో రామంకు తెలియదు. కళ్ళు తెరచి చూచేటప్పటికి శేషు లేడు. కాగితపు వుత్తరం ఒకటి పడివుంది. దానిలో శేషు యిలా వ్రాసేడు—

"పురుషుడే కష్టాలను కోరితెచ్చుకుంటాడు. హైందవస్త్రీ సీతవలె పవిత్రమైంది. ప్రేమించడం స్త్రీకే తెలుసు. పురుషుడు ఎంతసేపు యితరులు చెప్పే చెడ్డనే లెక్కించుతాడు: కాని ఎంతో ప్రేమించే భార్యనుకూడా విశ్వసించడు. కొందరు తాము తెలుసుకోలేనంత ఎక్కువగా భార్యని ప్రేమిస్తారు. ఒక చిన్నవిషయం చాలు అంతటి ప్రేమను కూలదోయడానికి. యిది పురుష లక్షణం'' అని వుంది.

'లీలను క్షమించరాదు'' అంటూ తేనీళ్ళకి తెచ్చుకొని లోపలికి పోయేడు రామం. లీల జేబురుమాళ్ళపై "రామం'' అని రంగుదారంతో కుట్టుతోంది.

"నీ నగలు దొంగలు ఎత్తుకుపోయారన్నాడు?" అంటూ వురిమేడు రామం.

"ఏం! మీకు నమ్మకంలేదు ?"

"లేకేం యివిగో" అని లీల ముఖంపైకి విసిరి పారేసాడు.

లీలకు యిదంతా అగమ్యగోచరంగా వుంది. రామం తనకేదో అనుమానిస్తున్నాడని ఏడుస్తూ రామం కాళ్ళమీద పడింది.

"యీ నగలు బాగుచేయమని కంసాలికి యిచ్చేను. కంసాలి నిన్న మధ్యాహ్నం తెచ్చి యిచ్చేడు. అవి పొట్లంలో కట్టి బీరువాపై పెట్టాను. మీరు ఆఫీసునుండి వచ్చినతర్వాత పెట్టుకుందామని. చూచేను పొట్లం లేదు, యింతవరకే నాకు తెలుసు" అని వెక్కి వెక్కి ఏడ్చింది.

రామారావు సందిగ్ధంలో పడ్డాడు.

చిట్టిని ఎత్తుకొని శేషు లోపలికి రావడంచూసి లీల లోపలికి పోయింది.

"ఏముఖంపెట్టుకొని మళ్ళీవచ్చావు" అన్నాడు రామం.

"తొందరపడకు యిందాకనే చెప్పదామంటే నీవు నిద్రపోయినట్టు పడుకున్నావు. మళ్ళీవొద్దామని వెళ్ళాను, యిప్పుడు పూర్తిగా చెప్పుతాను. నిన్న నీవు ఆఫీసునుంచి రావడంతోనే నేను వచ్చాను యిక్కడ. మనం మాట్లాడడం అయిపోయినతర్వాత నన్ను ఆపి మా చిట్టికని రెండు పొట్లాలు నా చేతులో పడేసావు. యింటికి పోయినతర్వాత ఆ పొట్లాలు చిట్టికిచ్చేను. అందులో ఒకటి కోవాబిళ్ళలు. రెండోది యీ నగలు పొట్లం. నీ పొరబాటుగ్రహించి, లీలమీద నీ కెంత విశ్వాసముందో చూద్దామని యీ నగల ఆధారంతో యీ పన్నాగం పన్నేను. నన్ను క్షమించు" అని రామంచేతులు పట్టుకున్నాడు శేషు.

యిదంతా అవతలి గదిలో వుండి వింటున్న లీల హృదయం తేలికపడింది కాని పళ్ళుపటపట కొరుకుతూ తన పనిలోనికి పోయింది.

---

## వీరేశలింగం హైస్కూలు

ఆర్. బి. పెండ్యాల గారి ఆవేదనాపూరితమైన వ్యాసం ముద్రితమైన తదుపరి—ఈ స్కూలుకు డైరక్టరుగారు తాత్కాలిక రికగ్నిషన్ గ్రాంటు చేసిన శుభవర్తమానం తెలియవచ్చింది. ఇంతటనైనా శాశ్వతమైన రికగ్నిషన్‌ను సంపాదించవలసిన ప్రబలబాధ్యత ప్రజలపై ఉన్నది. సత్వర యత్నం చేస్తారని నమ్ముతున్నాము. —[సం॥]

పడిపోవలిసిందేనా ?

# వీరేశలింగ విద్యాపీఠం

ఆర్. బి. పెండ్యాల

స్వర్గీయ కందుకూరి వీరేశలింగంపంతులు గారిని ఏటేటా ఆంధ్రులు స్మరిస్తూ జేగీయమానంగా ఉత్సవాలయితే జరుపుతున్నారు. కాని ఆయన స్థాపించిన హితకారిణీ సమాజమూ, ఆ సమాజపు ఆధ్వర్యాన నడపబడుతున్న వీరేశలింగా స్త్రీకోన్నత పాఠశాలా దరిద్రాణంగా ఉన్నాయి. జూన్ 4 వ తేదీన ఎనిమిది వందల మంది విద్యార్థులు చదువుకొనే ఉన్నత పాఠశాల గవర్నమెంటు రికగ్నిషన్ పోగొట్టుకొన్నది. పట్టణానికి వీరేశలింగం పాఠశాల బహుకాలం నుంచీ ఇతర విద్యా సంస్థలకన్న మకుటాయమానంగా ఉంటూ కొంతకాలంనుంచి వ్యక్తుల అధికార స్వార్థానికి ఆహుతి అయింది. ఫలితం ఏమంటే పట్టణంలో ఎనిమిది వందలమంది విద్యార్థులకు ఆస్కారంగా ఉన్న సంస్థ అధఃపతనమైంది.

ఈ నెల 23 వ తేదీనాడు ఈ సంస్థను తెరవడానికి వీలులేకుండా విద్యాశాఖ డైరెక్టరుగారు హుకుం జారీచేశారు.

ఈ పరిస్థితుల్లో 'పేరెంట్సు ఎసోషియేషన్, వెంటనే ఏర్పడి తగిన ఆందోళన చేసి, విద్యాసంస్థలోని లోపాలు సవరించి సంస్థ నిర్విఘ్నంగా కొనసాగే విధానం చూడక తప్పదు. పిల్లల తల్లిదండ్రులకు ఆమాత్రం బాధ్యత లేకపోతే రాజమహేంద్రవరం నిర్వీర్యమైపోయిందని ఘంటాపథంగా చెప్పవచ్చు. కనీసం ఈ పతనావస్థలోనైనా ప్రజానీకం మేలుకొని విద్యాపీఠాన్ని తిరిగి స్థాపించే విధానం చూడకపోతే పేపరు మిల్లుతో పాటు వీరేశలింగంపాఠశాలా భవనంకూడా ఆంధ్రుల అప్రతిష్ఠకు చిహ్నం అవుతుంది. హితకారిణీ సమాజమూ, పాఠశాలా బాగుపడితేనే వీరేశలింగంగారి ఆత్మకు తృప్తి. లేకపోతే ఎన్నెన్ని ఉత్సవాలు చేసినా ప్రయోజనశూన్యం. ఈ సందర్భంలో రాజమహేంద్ర పురవాసులే కాకుండా యావదాంధ్రులూ సంస్థను 'పునర్నిర్మించేందుకు తీవ్రకృషి చెయ్యాలి.